క్లుప్తంగా

విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు



బెల్టులు, ప్రశంసా పత్రాలు ఇస్తున్న మాస్టర్లు

కొందుర్గు: న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 62 మంది విద్యార్థులకు న్యూమాంక్స్ కుంగ్‌ఫూ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌పటేల్ పరీక్షలు నిర్వహించి బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యూమాంక్స్ సౌత్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కనకం యాదవ్, జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ రమేష్, మాస్టర్లు బాల్‌రాజ్, మెహరాజ్, గణేష్, రామ కృష్ణ, గౌతమ్ పాల్గొన్నారు.

మల్లన్న జాతర షురూ



జాతరలో పాల్గొన్న శుభప్రద్‌పటేల్

శంకర్‌పల్లి: మండల పరిధిలోని మహాలింగపురంలో మల్లికార్జునస్వామి (మల్లన్న)జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మల్లన్న జాతరకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో బీఆర్ఎస్‌ అధికార ప్రతినిధి కోమటిరెడ్డి లక్ష్మీనరసింహ్మారెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, సర్పంచ్ మాణిక్‌రెడ్డి, ఎంపీటీసీ భవాని యాదగిరి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్వామీలు

షాద్‌నగర్: మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులోని వేద పాఠశాల ఆవరణలో ఆదివారం కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య స్వామి, చిన్న సిద్ధరామ పండిత శివాచార్య, డాక్టర్ మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య స్వాములు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కౌన్సిలర్ వెంకటరాంరెడ్డి, వీరశైవ సమాజం గౌరవాధ్యక్షుడు బసవేశ్వర్, అధ్యక్షుడు ప్రవీణ్, శ్రావణ్‌కుమార్, రమేష్, రాజుపాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జాతీయ స్థాయిలో సీఎం కేసీఆర్ మెగా ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో షాద్‌నగర్‌కు చెందిన న్యూపర్ కుంగ్‌ఫూ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కుంగ్‌ఫూ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులను కైవసం చేసుకున్నట్లు మాస్టర్లు బాల్‌రాజ్, అహ్మద్‌లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పలువురు అభినందించారు.

శివస్వాముల మహాపడిపూజ



మహాపడి పూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: మండల కేంద్రంలోని ఉమా మహేశ్వరస్వామి దేవాలయంలో గురుస్వామి కమ్మరిభూపాలచారి ఆధ్వర్యంలో ఆదివారం శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం శివనామ స్మరణతో మార్మోగింది. స్వామివారి మహాపడి పూజలో భక్తులు పాల్గొని శివనామస్మరణ, భక్తి పాటలు, భజనలు, కీర్తనలను అలపించారు. మహాపడిపూజ కార్యక్రమానికి వివిధ మండలాల నుంచి శివస్వాములు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం యాదగిరి, శ్రీశైలం సహకారంతో శివస్వాములు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

మూగజీవాలకు అందని వైద్యం

- మండలంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బందులు పడుతున్న పెంపకం దారులు
- పట్టించుకోని అధికారులు



తాళ్లపల్లిలో సిబ్బంది లేక మూతపడిన పశువైద్య ఉపకేంద్రం

షాబాద్: పశువులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. పశువులకు, గొర్రెలకు రోగాలు వస్తే చికిత్స చేయించాలో లేదో తెలియక గొర్రెల కాపరులు, పాడి రైతులు అయోమయంలో ఉన్నారు. మండలంలో మొత్తం రెండు పశువైద్య కేంద్రాలు, ఆరు ఉప కేంద్రాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 14,046 పశువులు ఉండగా..67,146 గొర్రెలు,మేకలు ఉన్నాయి. అదే విధంగా 15,112 కోళ్లు ఉన్నాయి. వీటన్నింటికి పశువైద్య సిబ్బంది ఆరు నెలలకోసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాల్సి ఉంటుంది. అదే విధంగా గొంతువాపు, జబ్బవాపు, పార్శురోగం, చిటికవ్యాధులకు టీకాలను అందించాల్సి ఉంటుంది.

ఇద్దరే డాక్టర్లు..

మండలంలోని షాబాద్ డాక్టర్ స్రవంతి, రేగడిదోస్వాడ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిలు ఇద్దరు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే తాళ్లపల్లి, చందనవెల్లి, పోతుగల్, మాచన్‌పల్లి, బోడంపహాడ్, సర్దార్‌నగర్ పశువైద్య ఉప కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉండడంతో ఆయా గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నా..లేనట్టేనని ఆయా గ్రామాల రైతులు, గొర్రెల కాపరులు ఆరోపిస్తున్నారు. డాక్టరు లేక, సిబ్బంది లేక పశువైద్య కేంద్రాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లోని పాడి పశువులు, గొర్రెలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సొంత భవనాలను నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించినప్పటికీ వైద్యులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. సిబ్బంది కొరతతో గ్రామాల్లో రైతులు తమ పశువులకు, గొర్రెలకు ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పశువైద్య సిబ్బందితో పాటు పది మంది పశువైద్య సహాయకులు, మరో పదిమంది సహాయకులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే చందనవెల్లి, సర్దార్‌నగర్‌లో మాత్రమే పశువైద్య సహాయకులు ఉన్నారు. తాళ్లపల్లి, మాచన్‌పల్లి, పోతుగల్, బోడంపహాడ్ గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాల్లో సిబ్బంది లేక మూతపడ్డాయి. షాబాద్, రేగడిదోస్వాడలో మాత్రమే ఇద్దరు డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రాల్లో సిబ్బందిని నియమించి పాడిపశువులు, గొర్రెలకు వైద్యసేవలు అందేలా చూడాలని పాడిరైతులు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది కొరత వాస్తవమే..



మండలంలోని పశువైద్య సిబ్బంది కొరత ఉండడం వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పశువైద్య సిబ్బంది లేని సబ్‌సెంటర్లలో పాడి రైతులు, గొర్రెల కాపరులకు తమ సమస్యలు తెలియ జేస్తే సిబ్బందిని అక్కడకు పంపించి పశువులు, గొర్రెలకు వైద్యసేవలు అందిస్తాం.

–డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి,
రేగడిదోస్వాడ పశువైద్యాధికారి

సిబ్బందిని నియమించాలి...



పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరతను అధికారులు తీర్చాలి. మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. సిబ్బంది కొరతతో మూగజీవాలకు వైద్యం అందక పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–యాదవరెడ్డి, రైతు బొబ్బిలిగామ

తీవ్ర ఇబ్బందులు...



గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి పశువైద్య కేంద్రాన్ని నిర్మించిన సిబ్బంది లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. సిబ్బంది లేకపోవడంతో ఉపకేంద్రం మూత పడడంతో పాటు పశువులు, గొర్రెలకు వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉన్నతాధికారులు సిబ్బందిని నియమించి సమస్య పరిష్కరించాలి.

–గజేందర్‌గౌడ్, రైతు నాగర్‌కుంట

ప్రజాధనం బీఆర్ఎస్ ప్రభుత్వం పాలు

బీజేపీ నాయకుడు చంద్రశేఖర్



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో పన్నుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకుంటుందని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ విమర్శించారు. కొత్తూరు మండలం పెంజర్ల గామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి చంద్రశేఖర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ అబద్ధాల పోకడ నేటికీ కొనసాగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. బంగారు తెలంగాణగా చేస్తానని చెప్పిన కేసీఆర్ బాధల తెలంగాణగా మారుస్తున్నారని చెప్పారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దోచుకుంటున్న ఏకైక సీఎం కేసీఆర్‌ని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీపై నమ్మకంతో స్వచ్ఛందంగా చేరుతున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో షాద్‌నగర్ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేయడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అందెబాబయ్య, అశోక్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భీంరెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మా, మాణిక్యం, సుధాకర్, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురంగల్‌లో క్రికెట్ టోర్నమెంట్



జట్టుకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆర్కే జట్టు విజయం సాధించింది. సురంగల్ గ్రామానికి చెందిన స్వర్గీయ పాండురంగాచారి జ్ఞాపకార్థం ఆయన కుమారులు భాస్కరాచారి, శేఖర్‌చారి శ్రీవైష్ణవి జ్యువెలర్స్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో తొమ్మిది జట్లు పాల్గొనగా ఆర్కేజట్టు, ఈగల్ జట్టు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్టు మధ్య హోరాహోరి పోరు జరిగింది. చివరకు ఆర్కేజట్టు ఈగల్ జట్టుపై విజయం సాధించి టైటిల్ గెలుచుకుంది. విజేత జట్టుకు రూ.5వేలు, షీల్డు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.మూడున్నర వేలు నగదు, షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయినంద్‌చారి, విజయ్‌గౌడ్, మశ్చందర్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి ప్రైజ్‌మని

జట్టు నిర్ణయాన్ని అభినందించిన గ్రామస్తులు



ప్రైజ్‌మనిని బాధితుడికి అందజేస్తున్న జట్టు సభ్యులు

చేవెళ్ల: క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన ప్రైజ్‌మనిని గ్రామంలోని పేదల వైద్యానికి అందించి ఆలూరు జట్టు సభ్యులు వారి మానవత్వాన్ని చాటుకున్నారు. వారి ఉదార స్వభావాన్ని మండల నాయకులు, ప్రజలు అభినందించారు. ఆదివారం ఆలూరు గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన తలారి చిట్టయ్య(క్రిష్ణ)కు రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతనికి ప్రైజ్‌మనిని అందజేశారు. చేవెళ్ల మండలంలో గత నెలరోజుల పాటు జరిగిన పైండ్ల గోపాల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం ఆలూరు, ఇబ్రహీంపల్లి జట్లు తలపడగా ఆలూరు అంబేద్కర్ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో టోర్నమెంట్ నిర్వాహకులు ప్రకటించిన నగదును, షీల్డ్‌ను అందుకున్నారు. అంబేద్కర్ జట్టు సభ్యులు అంతా కలిసి తాము సంపాదించిన ప్రైజ్‌మనిని గ్రామంలోని పేదల వైద్య ఖర్చులకోసం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. నిర్ణయించుకోవటమే కాదు వెంటనే గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన తలారి (క్రిష్ణ) చిట్టయ్యకు జట్టు సభ్యులు రూ.20వేల నగదును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జట్టు కెప్టెన్ రాజు మాట్లాడుతూ.. తమ విజయానికి గ్రామస్తుల ప్రోత్సాహం ఉందని అందుకే తమకు వచ్చిన పేరు గ్రామానికి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అశోక్, అంబేద్కర్ యూత్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి సహకారం అందించండి

మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ అన్నారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కంఠ మహేశ్వరస్వామి దేవాలయం, ఎల్లమ్మ దేవాలయం నిర్మాణాలకు గౌడసంఘం నాయకులతో కలిసి ఆదివారం వారు భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపాతి రజిత, ఎంపీటీసీ మంగమ్మ, ఉపసర్పంచ్ శేఖర్‌గౌడ్, గౌడసంఘం నాయకులు బొందయ్యగౌడ్, రాముగౌడ్, బాలయ్యగౌడ్, నారాయణగౌడ్, నర్సింహగౌడ్, గోవింద్‌కొండయ్య, వెంకటయ్య, బాలయ్య, అంజయ్య, జంగమయ్య, శేఖర్, వీరేశ్, శ్రీను, కృష్ణ, తిరుపతిగౌడ్, నాగరాజుగౌడ్, కొండల్, కోటి తదితరులు పాల్గొన్నారు.

తీరిన నీటి సమస్య..

రాత్రికి రాత్రే మోటార్ బిగించిన సర్పంచ్

కొందుర్గు: మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో గత వారం రోజులుగా కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామపంచాయతీ చుక్కమెట్టు గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడింది. గ్రామంలో చెడిపోయి ఉన్న బోరు మోటార్‌ను బాగుచేయించి తమ దాహార్తిని తీర్చాలని సర్పంచ్ నర్సింహారెడ్డిని గ్రామస్తులు కోరినప్పటికి స్పందించలేదు. గ్రామానికి చెందిన శేఖర్ అనే యువకుడు సర్పంచ్‌కు ఫోన్‌చేయగా సర్పంచ్ నర్సింహారెడ్డి ఆ యువకుడిని దుర్భాషలాడారు. ఇందుకు సంబంధించిన ఆడియో సంభాషణను శేఖర్ సోషల్ మీడియాలో వైరల్ చేయగా సర్పంచ్ నర్సింహారెడ్డి వెంటనే స్పందించి శనివారం రాత్రికి రాత్రే సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం చుక్కమెట్టు గ్రామస్తులు సింగిల్‌ఫేజ్ మోటార్ ద్వారా నీళ్లు తాగుతున్నారు. దీంతో గ్రామస్తులు తమకు తాగునీటి సమస్య తీరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి బైపాస్ రహదారి సమీపంలో గల ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్(ఎఫ్‌సీఎన్)అనాథశ్రమంలో యువతులకు కుట్టులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎఫ్‌సీఎన్ ప్రతినిధి శ్రీను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ ఈ నెల 13నుంచి ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలోనే మానేసిన, వివాహం కాని యువతులకు కుట్టు, ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇవ్వ డం జరుగుతుందని తెలిపారు. ఉచిత భోజన వసతిని కల్పించి ఎఫ్‌సీఎన్ సంస్థ పర్యవేక్షణలో శిక్షణ కేంద్రాన్ని నిర్వహించడం జరుగు తుందని పేర్కొన్నారు. అమ్మాయిలు 18నుంచి 22సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, శిక్షణ కాలం మూడు నెలలు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కాలంలో వ్యక్తిత్వ వికాసం, కుటుంబ జీవన విధానం వంటి జీవన నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందని తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు ఉచితంగా కుట్టు మిషన్‌లను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్‌ఇన్‌నీడ్ సంస్థను సంప్రదించాలని కోరారు.

సెంట్రింగ్ కార్మికుల సంక్షేమానికి కృషి

మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో వేంకటేశ్వర భవన నిర్మాణ (సెంట్రింగ్) కార్మిక సంఘం కార్యకర్తల సమావేశం ఆదివారం ఎల్మినేడు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు భాష, కోశాధికారి ఐలయ్య, సెక్రెటరీ రమేష్, జనరల్ సెక్రెటరీ మల్లేశ్, వ్యవస్థాపకులు జంగయ్య, నారయణ, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లో ఉందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శివదత్తా గార్డెన్‌లో అభ్యాస్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని చెప్పారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భం గా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, వ్యాపారవేత్తలు పాండురంగం, సతీష్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, యాజమాన్యం బృందం శివకుమార్, పార్థసారధి, మధు, వినోద్, లక్ష్మీకాంత్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: కేశంపేట మండల పరిధిలోని పోమాలపల్లి గుట్టపై వెలిసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం లక్ష్మీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో జెడ్పీటీసీ తాండ్ర విశాల, శ్రావణ్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్‌రావు, సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ రమేష్, వెంకటేష్‌గుప్త, వెంకటయ్య, ఉప సర్పంచ్ మల్లేష్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



శంకర్‌పల్లి: వ్రతాలు చేస్తున్న దంపతులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ప్రతి నెల సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, రమేష్, లక్ష్మి, విజయమ్మ, శ్రీనివాసులు, శ్రీనివాస్, రాజు, నవీన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శివాలయంలో సామూహిక వ్రతాలు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారుల్లోని మరకత శివాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. 47 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం మరకత శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భారతీస్వామి

మొయినాబాద్: మండల కేంద్రంలోని నాగలింగేశ్వరస్వామి(శివాలయం), పంచయాతన ఆంజనేయ స్వామి దేవాలయం సప్తమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు, భారతీ స్వామి చేతులమీదుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యావచనము, నవగ్రహ స్థాపిత దేవతల పూజ, గణపతి హోం, నవగ్రహ హోమం, రుద్రహోమం, బలిప్రధానము, పూర్ణాహుతి, హారతి, అభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పము కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రెండవ రోజు శివపార్వతులకు అభిషేకాలు



శివపార్వతులకు మహామంగళ హారతి సమర్పిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి సమీపంలో గల త్రివేణి సంగమంలో వెలిసిన సంగమేశ్వర దేవాలయంలో రెండవ రోజు శివపార్వతులకు అభిషేకాలు, దివ్యరథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సంగమేశ్వర దేవాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితులు, పూజారులు మహామంగళ హారతి సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దీంతో దేవాలయంలో రెండవ రోజు భక్తులు బారులు తీరారు. సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సత్యనారాయణ వ్రతాలతో పాటు పార్వతీ, పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు వేదపండితులు, పూజారులు తెలిపారు. సాయంత్రం వీధి నాటకాలు, భజనలు కొనసాగుతాయని తెలిపారు. కల్యాణ మహోత్సవం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని అందరు సమయపాలన పాటించి విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

జెడ్పీటీసీ తాండ్రవిశాల శ్రవణ్‌రెడ్డి



కల్యాణోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ తాండ్రవిశాల శ్రవణ్‌రెడ్డి, తదితరులు

కేశంపేట: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని జెడ్పీటీసీ తాండ్రవిశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డి పల్లి గ్రామంలోని పోమాలగుట్టపై వెలిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ శేఖర్‌పంతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కల్యాణోత్సవ కార్యక్రమంలో జెడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతినిత్యం భగవన్నామ స్మరణతో ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లెనర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, అంజయ్య, వెంకటేశ్వరశర్మ, పోమాల్‌పల్లి సర్పంచ్ కృష్ణయ్య, డిప్యూటీ సర్పంచ్ మల్లేష్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు గంధోత్సవం



దట్టీలతో ఊరేగింపుగా వెళ్తున్న మాజీ సర్పంచ్

నందిగామ: మండల పరిధిలోని చేగూరు శివారులో హజ్రత్ సయ్యద్ నిజాం షాహిద్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ మామిళ్ల పాండయ్య ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు పెద్ద ఎత్తున హాజరై దట్టీలను తలపై పెట్టుకొని ఘనంగా ఊరేగింపుగా వెళ్లి దర్గాకు సమర్పించారు. అనంతరం మతపెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు రవి గౌడ్, గ్రామస్తులు అజ్జర్, ఖాలేద్, అబేద్, ఖదీర్, షరీఫ్,జంగయ్య, నరేందర్,అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.